సాక్షి
నిర్మల్
మంగళవారం । 30 । మే । 2023



తేనెటీగల నుంచి తప్పించుకుందామని..

తేనెటీగల దాడి నుంచి తప్పించుకునేందుకు ఓ యువకుడు బావిలో దూకాడు. బావి లోతు ఎక్కువగా ఉండడం, అతడికి ఈత రాకపోవడంతో నీట మునిగి మృతిచెందాడు. 8లో▸



ప్రభుత్వ ఆదాయానికి గండి..!

జిల్లాలో ఇసుక అక్రమదందా మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సాగుతోంది. అక్రమార్కులు ఇసుకను అమ్ముకుని రూ.లక్షలు గడిస్తుండగా, శాఖల మధ్య సమన్వయలోపంతో ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
40.5 /29.5

ఉష్ణోగ్రత మళ్లీ పెరుగుతుంది. ఆకాశం కొంత మేర మేఘావృతమౌతుంది. మధ్యాహ్నం తర్వాత వేడి, ఉక్కపోత పెరుగుతుంది. వేడిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

సమస్యలు పరిష్కరించండి సారూ..

- ప్రజావాణిలో బాధితుల వేడుకోలు
- వివిధ ప్రాంతాల నుంచి 23 మంది దరఖాస్తు



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు

నిర్మల్‌చైన్‌గేట్: తమ సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో బాధితులు అధికారులను వేడుకున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 23 మంది కలెక్టరేట్‌కు వచ్చి అదనపు కలెక్టర్ రాంబాబుకు అర్జీ పెట్టుకున్నారు. సమస్యలను వివరించారు. స్పందించిన అదనపు కలెక్టర్ వెంటనే సమస్యలు పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఎంతో ఆశతో కలెక్టరేట్ తలుపు తడుతున్న వారికి న్యాయం చేయాలన్నారు.

నేడు'కౌమారామృత శతకం' ఆవిష్కరణ

నిర్మల్ ఖిల్లా: నిర్మల్ జిల్లాకు చెందిన ప్రముఖ కవి చట్ల గజ్జారాం రచించిన కౌమారామృత శతకం గ్రంథాన్ని మంగళవారం ఆవిష్కరించనున్నట్లు నిర్మల భారతి సాహితీ క్షేత్రం అధ్యక్షులు తోడిశెట్టి పరమేశ్వర్ తెలిపారు. ఉదయం 10 గంటలకు జిల్లాకేంద్రంలోని దివ్య గార్డెన్స్‌లో మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఈ పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. జిల్లాకు చెందిన కవులు, రచయితలు, సాహితీవేత్తలు, కళాకారులు కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

ప్రతి ఒక్కరికీ పోలీస్ రక్షణ



అర్జీదారుని సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ

నిర్మల్ టౌన్: జిల్లాలో ప్రతి ఒక్కరికీ పోలీస్ రక్షణ ఉంటుందని ఎస్పీ ప్రవీణ్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఎస్పీ వారి సమస్యలు తెలుసుకుని సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. నాణ్యమైన పోలీసు వ్యవస్థను జిల్లా ప్రజలకు అందించడమే లక్ష్యమన్నారు. పోలీసుల సహాయం కావాలనుకునేవారు ఠాణాలో నిర్భయంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనబడినా, సంఘ వ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిసినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. జిల్లా వాట్సాప్ నంబర్ 8712659599 కు అయినా సమాచారం అందించాలని సూచించారు.

అనాథల గోడు పట్టదా సారూ..



గత సంవత్సరం ప్రజావాణికి వచ్చిన సందర్భంగా 'సాక్షి'లో ప్రచురితమైన కథనం



సరిగ్గా ఏడాది క్రితం లోకేశ్వరం మండలం నగర్ గ్రామానికి చెందిన గుజ్జ గౌతమి, గుజ్జ పూజ కలెక్టరేట్‌కు వచ్చారు. 'సార్ మా నాన్న 12 ఏళ్ల క్రితం చనిపోయాడు.. రెండేళ్ల క్రితం అమ్మ చనిపోయింది. దిక్కు తోచని స్థితిలో ఉన్నాం' అని వేడుకున్నారు. దీనికి సబంధించి పత్రికల్లో వచ్చిన వార్తను చూసిన మంత్రి కేటీఆర్ ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఆదుకోవాలని అప్పటి కలెక్టర్ ముషరఫ్ అలీకి సూచించారు. అదనపు కలెక్టర్ రాంబాబు పూజకు లెఫ్ట్ పోచంపాడ్ పాఠశాలలో సీటు ఇప్పించారు. అదే సమయంలో ఇంటర్ చదివిన గౌతమి తనకు ఏదైనా చిన్న ఉద్యోగం ఇప్పించాలని ప్రాధేయపడింది. కానీ ఇప్పటికీ ఉపాధి చూపలేదు. దీంతో సోమవారం మళ్లీ కలెక్టరేట్‌కు వచ్చింది గౌతమి. అయితే కలెక్టరేట్‌లో అధికారులు వారెవరో తెలియదన్నట్లు వ్యవహరించారు. దీంతో తమను ఆదుకోవాలని గౌతమి మీడియా ముఖంగా కలెక్టర్‌ను వేడుకుంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్

లక్ష్యం దిశగా ఆయిల్‌పాం సాగు!



కన్నాపూర్‌లో సాగుచేస్తున్న ఆయిల్‌పాం పంట

- జిల్లాలో ఈ ఏడాది 8 వేల ఎకరాల్లో సాగుకు ప్రణాళిక
- ప్రస్తుతం సిద్ధంగా 4 లక్షల మొక్కలు..

లోకేశ్వరం: జిల్లా ఆయిల్‌పాం సాగు లక్ష్యాన్ని చేరుకునే దిశగా ఉద్యానవనశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. గతేడాది జిల్లాలో 3,170 ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు చేయగా, ఈ ఏడాదిలో సాగు విస్తీర్ణం లక్ష్యాన్ని 8 వేల ఎకరాలకు పెంచారు. గతేడాదిలాగే ఈసారి కూడా జిల్లాలో లక్ష్యాన్ని చేరేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. దశలవారీగా సాగుకు చర్యలు తీసుకుంటున్నారు.

గతేడాది టార్గెట్ పూర్తి..

జిల్లాలో ఆయిల్‌పాం సాగుకు గతేడాది విధించిన లక్ష్యాన్ని అధికారులు వంద శాతం పూర్తి చేశారు. జిల్లాలో 3,170 ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు చేయాలని లక్ష్యం విధించారు. ఈమేరకు జిల్లాలో 314 మంది రైతులను గుర్తించి వారికి సంబందించిన 3,170 ఎకరాల్లో ఆయిల్‌పాం మొక్కలను నాటించారు. ఈయేడు విధించిన లక్ష్యానికి తగ్గట్టుగా పంట సాగు చేయించేందుకు అధికారులు రైతుల ఎంపిక ప్రక్రియ ప్రారంభించారు.

సాగుకు ప్రోత్సాహకాలు...

ఆయిల్‌పాం సాగు విస్తీర్ణం పెంచేందుకు ప్రభుత్వం రైతులకు వివిధరకాల ప్రోత్సాహకాలు అందిస్తోంది. ఇందులో భాగంగా మొక్క అసలు ధర రూ.213 ఉండగా, రైతులకు రూ.20కే అందిస్తోంది. మిగతా 193ను ప్రభుత్వమే భరిస్తోంది. ఆయిల్‌పాం మొక్కల నిర్వహణతోపాటు మొక్కల మధ్య అంతర పంట సాగు చేసుకునేందుకు ఏటా ఎకరాకు రూ.4,200 చొప్పున నాలుగేళ్ల నగదు అందిస్తుంది. ఆయిల్‌పాం సాగుచేసే రైతులకు 90 శాతం సబ్సిడీపై డ్రిప్ పరికరాలు మంజూరు చేస్తోంది.



ఆయిల్‌పాం నర్సరీని పరిశీలిస్తున్న కలెక్టర్

ఖరీఫ్‌లోనే లక్ష్యం సాధించేలా..

జిల్లాలో 2023–24లో ఆయిల్‌పాం సాగు లక్ష్యాన్ని నెరవేర్చేందుకు జిల్లా ఉద్యానవన శాఖ అధికారులు దశల వారీగా ప్రణాళిక రూపొందించారు. లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు అందుబాటులో ఉంచారు. ఎకరాకు 50 చొప్పున నాటించనున్నారు. ఈ మేరకు 4 లక్షల మొక్కలు సిద్ధంగా ఉంచారు. 8 వేల ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు చేయించేందుకు 860 మంది రైతులను గుర్తించారు. దీంతో ఖరీఫ్‌లోనే లక్ష్యం చేరుకునేలా కసరత్తు ప్రారంభించారు.

రైతుల్లో పెరిగిన నమ్మకం..

జిల్లాలో ఆయిల్‌పాం సాగుకు ఉద్యానవన శాఖ తీసుకుంటున్న చర్యలతో రైతులకు నమ్మకం పెరిగింది. దీంతో సంప్రదాయ పంటల స్థానంలో దీర్ఘకాలిక లాభాలు వచ్చే ఆయిల్‌పాం సాగుకు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. మొదట వెనుకడుగు వేసినా.. ఇప్పుడు ఆసక్తి చూపుతున్నారు.

అంతర పంటలు సాగు చేశా



నేను ఐదెకరాల్లో ఆయిల్‌పాం పంటను సాగు చేశాను. ఇందులో అంతర పంటగా సోయా, మొక్కజొన్న సాగు చేస్తున్నా. ఆయిల్‌పాం దిగుబడి వచ్చేలోగా జిల్లాలో మార్కెట్ సౌకర్యం కల్పించాలి. మార్కెట్ ఏర్పాటు చేస్తే చాలా మంది రైతులు సాగుకు ముందుకు వస్తారు.

– దేవేందర్, రైతు, కన్నాపూర్

లక్ష్యాన్ని పూర్తి చేస్తాం



ఈఏడాది జిల్లాలో 8 వేల ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు చేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈమేరకు ప్రణాళిక రూపొందించాం. ప్రస్తుతం ఖరీఫ్‌లో 8 వేల ఎకరాల్లో ఆయిల్‌పాం మొక్కలు నాటించేందుకు కసరత్తు చేస్తున్నాం. మిగతా లక్ష్యాన్ని వచ్చే రబీలో పూర్తి చేస్తాం.

– శ్యాంరావ్ రాథోడ్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి

ఎస్‌ఎంసీలు.. మరో ఆరు నెలలు!

- చైర్మన్ల గడువు పొడిగించిన ప్రభుత్వం



మంజులాపూర్ పాఠశాలలో ఎస్‌ఎంసీ సమావేశం(ఫైల్)

నిర్మల్ రూరల్: ప్రభుత్వ పాఠశాల యాజమాన్య కమిటీ(ఎస్‌ఎంసీ)లను మరో ఆరు నెలలు పొడిగిస్తూ రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ విద్యాలయాల అభివృద్ధిలో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులను భాగస్వాములను చేస్తూ ప్రభుత్వం ఎస్‌ఎంసీలను ఏర్పాటు చేసింది. సాధారణంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థులు 10వ తరగతి పూర్తయ్యాక వారి తల్లిదండ్రులు ఎస్‌ఎంసీ చైర్మన్‌గా లేదా సభ్యులుగా ఉంటే వారి స్థానంలో కొత్తవారిని ఎన్నుకుంటారు. తాజాగా ఇచ్చిన ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ప్రస్తుతం ఉన్నవారు మరో ఆరు నెలలు కొనసాగనున్నారు. మన ఊరు–మనబడి కార్యక్రమం నేపథ్యంలోనే ఈ కమిటీలను నవంబర్ 30 వరకు పొడిగించినట్లు సమాచారం. జిల్లావ్యాప్తంగా మొదటి విడత మన ఊరు–మనబడి అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఉన్న ఎస్‌ఎంసీ చైర్మన్లు, సభ్యుల తీర్మానాలతోనే పనులు చేస్తున్నారు.

పనులకు ఆటంకం కలగకుండా...

సర్కార్ బడుల్లో మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వం మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా మరమ్మతులు, నిర్మాణాలు చేపడుతోంది. మొదట రూ.30 లక్షలలోపు, అంతకుమించి ఎక్కువ కలిగిన వాటికి టెండర్ల ద్వారా నిర్వహించేందుకు నిర్ణయించారు. పలుచోట్ల కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో ప్రస్తుతం రూ.కోటి వ్యయంలోపు కలిగిన వాటిని జిల్లా అధికారులు, విద్యాశాఖ, ఎస్‌ఎంసీ, ప్రధానోపాధ్యాయులు, వివిధ శాఖల సమన్వయంతో చేపట్టేలా ప్రణాళికలు రూపొందించారు. ప్రస్తుతం ఉన్న ఎస్‌ఎంసీ చైర్మన్లు సభ్యుల తీర్మానంతో పనులు చేయిస్తున్నారు. ఇటు మధ్యాహ్న భోజనం, విద్యార్థులకు అందే ప్రతీ సంక్షేమ పథకం పర్యవేక్షించేలా ప్రభుత్వం అధికారం కల్పించింది.

జిల్లాలో 842 పాఠశాలలు..

జిల్లావ్యాప్తంగా 842 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో మొత్తం 58 వేలకుపైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. ఒక్కో తరగతి నుంచి విద్యార్థుల తల్లిదండ్రులు ఇద్దరినీ ఎస్‌ఎంసీలో సభ్యులుగా ఎంపిక చేస్తారు. వారందరూ కలిసి చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకుంటారు. ప్రాథమిక పాఠశాలలో పది మంది, ప్రాథమికోన్నత పాఠశాలలో 14 మంది, ఉన్నత పాఠశాలల్లో పదిమంది సభ్యులు ఉంటారు. బడుల అభ్యున్నతిలో వీరు క్రియాశీలకంగా వ్యవహరిస్తారు. ముఖ్యంగా ప్రభుత్వం కేటాయించే పాఠశాల నిర్వహణ, మధ్యాహ్న భోజనం, ఇతర నిధులు చైర్మన్, ప్రధానోపాధ్యాయుల ఉమ్మడి ఖాతాలో జమవుతాయి. కమిటీలు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సమ్మతితో వాటిని ఆయా బడులలో ఖర్చు చేస్తారు. గతంలో మూడు నెలలకు ఒకసారి పాఠశాలల్లో సమావేశాన్ని నిర్వహించేవారు. కానీ గత విద్యా సంవత్సరం నుంచి యాజమాన్య కమిటీ తల్లిదండ్రులు పోషకులు, ఉపాధ్యాయులతో ప్రతీనెల మూడో శనివారం ప్రత్యేక సమావేశం జరపాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆరోజు సెలవు ఉంటే మరుసటి శనివారం సమావేశం నిర్వహిస్తున్నారు.

ఉత్తర్వులు వచ్చాయి..

ఎస్‌ఎంసీ చైర్మన్ల పదవీకాలం 6 నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. నవంబర్ 30 వరకు పాత వారే కొనసాగుతారు. తిరిగి ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిన క్రమంలో కొత్త కమిటీల ఎంపిక డిసెంబర్లో జరిగే అవకాశం ఉంది.

– రవీందర్‌రెడ్డి, డీఈవో

తెలంగాణ ప్రగతిని చాటేలా దశాబ్ది వేడుకలు

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎస్పీ ప్రవీణ్‌కుమార్, జిల్లా అధికారులు

నిర్మల్‌చైన్‌గేట్: తొమ్మిదేళ్ల తెలంగాణ ప్రగతిని చాటేలా రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలు నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఉన్నత స్థాయి అధికారులతో కలిసి రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల ఏర్పాట్లపై కలెక్టర్లతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జూన్ 2 నుంచి 22 వరకు రాష్ట్ర దశాబ్ది వేడుకలు పండగ వాతావరణంలో నిర్వహించాలన్నారు. రైతు దినోత్సవం, ఊరూరా చెరువుల పండుగ నిర్వహణపై అధికారులు ప్రత్యేక ప్రణాళిక తయారు చేసుకోవాలన్నారు. రైతు దినోత్సవం రోజు రైతువేదికల్లో వేడుకలు నిర్వహించాలన్నారు. రైతులను డప్పు చప్పుళ్లతో రైతు వేదికలకు చేరుకునేలా చూడాలని తెలిపారు. అక్కడ ప్రభుత్వం రైతులకు ఇస్తున్న సౌకర్యాలు, అందించిన సహాయం గురించి వివరించాలని సూచించారు. భోజనం ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. చెరువుల పండుగ సందర్భంగా గ్రామాల్లో ఉన్న పెద్ద చెరువు వద్ద బతుకమ్మ, బోనాలతో సాంస్కృతిక కార్యక్రమాలు, కట్ట మైసమ్మ పూజ నిర్వహించాలని వివరించారు. విద్యుత్ రంగంలో గత పరిస్థితి, నేడు సాధించిన ప్రగతి తెలియజేస్తూ నాడు– నేడు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. పోలీస్ ఆధ్వర్యంలో సురక్ష దివస్, తెలంగాణ రన్ నిర్వహించాలన్నారు. పారిశ్రామిక ప్రగతి, సాగునీటి రంగంలో సాధించిన విజయాలు తెలియజేయాలన్నారు. జూన్ 9న సంక్షేమ సంబురాల్లో భాగంగా ప్రతీ నియోజకవర్గ పరిధిలో రెండో విడత గొర్రెల పంపిణీ, అవకాశం ఉన్న చోట ఇంటి పట్టాల పంపిణీ, బీసీ కులవృత్తుల వారికి ఆర్థిక సహాయం ప్రారంభించాలన్నారు. క్యాబినెట్ సబ్ కమిటీ నివేదిక ప్రకారం మార్గదర్శకాలు అందిస్తామని, దాని ప్రకారం లబ్ధిదారులను ఎంపిక చేసి జూన్ 9న ప్రారంభించాలన్నారు. పరిపాలన సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన నూతన జిల్లాలు, మండలాలు, గ్రామాల వివరాలు తెలియజేయాలని, మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలన్నారు. వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలో సాధించిన ప్రగతి, కొత్త ఆసుపత్రుల ఏర్పాటు, అందిస్తున్న అదనపు సేవలు వివరించాలని సూచించారు. వైద్య, ఆరోగ్య శాఖ దినోత్సవం రోజు కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ ప్రారంభించాలని తెలిపారు. పల్లె, పట్టణ ప్రగతిలో సాధించిన విజయాలు ఘనంగా చాటాలన్నారు. పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమాల సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులను సత్కరించాలని సూచించారు. 'సఫాయన్న సలాం' అన్న ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని తెలిపారు. మిషన్ భగీరథ కింద ఇంటింటికీ తాగునీటి సరఫరా, గిరిజనోత్సవం, పెరిగిన పచ్చదనం, విద్యాశాఖలో సాధించిన ప్రగతి తెలియజేయాలని వివరించారు. ఆధ్యాత్మికరంగంలో సాధించిన ప్రగతి, అమరుల సంస్మరణ కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు.

షెడ్యూల్ ప్రకారం....

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 2న ఉదయం 9 గంటలకు కలెక్టరేట్ ప్రాంగణంలో వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ప్రతీరోజు కార్యక్రమాలను ఘనంగా నిర్వహించడానికి గ్రామస్థాయి, మండలస్థాయి, జిల్లా స్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించి ఇప్పటికే సమీక్ష సమావేశాలు నిర్వహించామన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటనలు చేసి కార్యక్రమాల నిర్వహణకు అనువైన ప్రదేశాలను గుర్తించాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. జిల్లాలో అన్నిశాఖల ద్వారా సాధించిన ప్రగతి వివరించేలా పకడ్బందీగా దశాబ్ది వేడుకలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ ప్రవీణ్‌కుమార్, అదనపు కలెక్టర్ రాంబాబు, అటవీశాఖ అధికారి సునీల్, డీఆర్వో లోకేశ్, ఆర్డీవో స్రవంతి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జూన్ 2 నాటికి పనులు పూర్తి చేయాలి

- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



పనుల వివరాలు తెలుసుకుంటున్న మంత్రి

నిర్మల్ టౌన్: సమీకృత కలెక్టరేట్ పనులను జూన్ 2వ తేదీనాటికి పూర్తి చేయాలని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. జూన్ 4న సీఎం కేసీఆర్ నూతన కలెక్టరేట్‌ను ప్రారంభిస్తారని తెలిపారు. కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు విఠల్ రెడ్డి, రేఖానాయక్, ఆర్‌అండ్‌బీ ఈఎన్సీ గణపతిరెడ్డితో కలిసి నూతన కలెక్టరేట్ భవనాన్ని సోమవారం పరిశీలించారు. ప్రజలకు సుపరిపాలన అందించేందుకు సీఎం కేసీఆర్ నూతన జిల్లాలు ఏర్పాటు చేసి ప్రతీ జిల్లా కేంద్రంలో సమీకృత కలెక్టరేట్ భవనాలు నిర్మించారని చెప్పారు. ఈనెల 4న నిర్మల్ కలెక్టరేట్ ప్రారంభోత్సవం సీఎం కేసీఆర్ చేతులమీదుగా జరుగుతుందని తెలిపారు. అనంతరం నిర్వహించే సభకు వచ్చే ప్రజాప్రతినిధులు, ప్రజల కోసం పార్కింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. వారివెంట జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

సబ్ స్టేషన్‌కు శంకుస్థాపన



మాట్లాడుతున్న మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

మామడ: మండలంలోని కమల్‌కోట్, ఆదర్శనగర్ గ్రామాల మధ్య రూ.1.10 కోట్లతో నూతనంగా నిర్మించనున్న 33/11 కేవీ సబ్‌స్టేషన్‌కు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నాలుగు నెలల్లో సబ్‌స్టేషన్ పూర్తిచేసి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామని తెలిపారు. రూ.20 కోట్లతో గోదాం నిర్మిస్తామని, రూ.కోటితో కమల్‌కోట్ నుంచి బ్రిడ్జి వరకు రోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. సదర్మాట్ బ్యారేజీలో భూములు కోల్పోయిన వారికి ఎకరాకు రూ.10.40 లక్షల చొప్పున పరిహారం ఇచ్చామని తెలిపారు. జూన్ 4న సీఎం కేసీఆర్ నిర్మల్‌కు వస్తున్నారని మామడ మండలం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలి రావాలని కోరారు. అనంతరం రైతులకు జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ రాంకిషన్‌రెడ్డి, రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు వెంకటరాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక రమణ, కె.గంగారెడ్డి, లింగారెడ్డి, నవీన్‌రావు, భాస్కర్‌రావు, కమల్‌కోట్, ఆదర్శనగర్ గ్రామాల సర్పంచులు శ్రీకాంత్‌రెడ్డి, ముత్యంరెడ్డి, పాకాల రాంచందర్, వికాస్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, సర్పంచ్‌లు, విద్యుత్, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు..

న్యూ లింగంపల్లి గ్రామంలో రూ.50 లక్షలతో నిర్మించిన శివాలయం, హనుమాన్ ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, సర్పంచ్ గంగాధర్, నాయకులు చంద్రశేఖర్‌గౌడ్, గంగారెడ్డి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా ఆందోళన

- తహసీల్దార్‌కు రైతుల వినతి



ఫ్యాక్టరీ నిర్మాణం జరిగే చోట కంపెనీ ప్రతినిధులతో వాగ్వాదానికి దిగిన మండల రైతులు

దిలావర్‌పూర్: దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల నడుమ పచ్చని పంట చేల మధ్య గోదావరి పరీవాహక ప్రాంతంలో నిర్మించ తలపెట్టిన ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా రైతులు సోమవారం ఆందోళన చేశారు. ఫ్యాక్టరీ నిర్మించొద్దని దిలావర్‌పూర్, గుండంపల్లి రైతులు డిమాండ్ చేశారు. ఉదయం ఫ్యాక్టరీ నిర్మాణ స్థలానికి చేరుకున్న రైతులు కంపెనీ ప్రతినిధితో వాగ్వాదానికి దిగారు. వ్యవసాయ గోదాములని నమ్మించి ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మిస్తున్నట్లు తేలడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, యువజన నాయకుడు పాల్దె అనిల్, మాజీ ఎఫ్‌ఎస్‌సీఎస్ చైర్మన్ పాల్దె శ్రీనివాస్, ఆత్మ డైరెక్టర్ సప్పల రవి మాట్లాడుతూ పచ్చని పొలాల మధ్య 40 ఎకరాల విస్తీర్ణంలో గుట్టు చప్పుడు కాకుండా ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రా ప్రాంతానికి చెందిన సదరు ఫ్యాక్టరీ ప్రతినిధులు భూసేకరణ సమయంలో వ్యవసాయ గిడ్డంగులు నిర్మిస్తామని చెప్పారన్నారు. ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మిస్తే మండలంలోని గుండంపల్లి, నసీరాబాద్, దిలావర్‌పూర్, బన్సపల్లి గ్రామాలపై ప్రభావం ఉంటుందని, కాలుష్యం కారణంగా పంటలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ నిర్మాణం నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యర్థాలు గోదావరిలో కలిస్తే నీరు కలుషితమౌతుందని, మత్స్య సంపదకు ముప్పు వాటిల్లుతుందని తెలిపారు. ప్రభుత్వం ఇథనాల్ ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ కరీంకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఓ ప్రైవేటు కంపెనీ 38 ఎకరాల భూమి కొనుగోలు చేసిందని తెలిపారు. రిజిస్ట్రేషన్ కూడా పూర్తయిందని చెప్పారు. అయితే అక్కడ ఏ పరిశ్రమ పెడుతున్నారో తమకు సమాచారం లేదన్నారు. రైతుల వినతిని ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. ఆందోళనలో నాయకులు ధనె రవి, కుంట గంగారెడ్డి, కట్కం రాజారెడ్డి, గుణవంత్ రావుపాటిల్, తక్కల విద్యాసాగర్‌రెడ్డి, నామాయి సాయన్న, రైతులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

ఎగ్జామ్ ఆలోచన ఉపసంహరించుకోవాలి



మాట్లాడుతున్న ఆశ వర్కర్లు

నిర్మల్‌చైన్‌గేట్: ఆశ వర్కర్లకు మళ్లీ ఎగ్జామ్ నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి నియామక పత్రాలు అందజేయాలన్న ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు గంగమణి కోరారు. ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ రాంబాబుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశ వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, గతంలో మాదిరిగానే ప్రతీ నెల ఒకటి లేదా 2వ తేదీల్లో పారితోషికాలు చెల్లించాలన్నారు. పారితోషికం లేని అదనపు పనులు చేయించొద్దని కోరారు. స్పుటమ్ డబ్బాలను ఆశ వర్కర్లతో మోయించే పనిని రద్దు చేయాలన్నారు. టీబీ, లెప్రసీ, కంటి వెలుగు తదితర పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. పని భారం తగ్గించి జాబ్‌చార్ట్ విడుదల చేయాలని కోరారు. 2021, జూలై నుంచి డిసెంబర్ వరకు పీఆర్సీ ఎరియర్స్ వెంటనే చెల్లించాలన్నారు. కేంద్రం చెల్లించిన కరోనా రిస్క్ అలవెన్స్ నెలకు రూ.వెయ్యి చొప్పున 16 నెలల బకాయిలు చెల్లించాలని పేర్కొన్నారు. 32 రకాల రిజిస్టర్లను ప్రింట్ చేసి ప్రభుత్వమే సప్లయ్ చేయాలన్నారు. నాణ్యమైన యూనిఫామ్స్ ఇవ్వాలని సూచించారు. జిల్లా ఆస్పత్రుల్లో ఆశ వర్కర్లకు రెస్ట్ రూం ఏర్పాటు చేయాలని విన్నవించారు.

క్లుప్తంగా

విద్యాశాఖ మంత్రిని కలిసిన ఇన్‌చార్జి వీసీ



మంత్రి సబితారెడ్డితో వెంకటరమణ

భైంసా(ముధోల్): బాసర ఆర్జీయూకేటీ వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ సోమవారం విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా వర్సిటీలో సమస్యలు, ప్రవేశాల నేపథ్యంలో మంత్రిని కలిసి విన్నవించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

ఎలుగుబంటి సంచారం



రోడ్డుపై సంచరిస్తున్న ఎలుగుబంటి

తాంసి(బోథ్): మండలంలోని జామిడి శివారులో సోమవారం ఎలుగుబంటి సంచరించింది. పొలోది గ్రామానికి చెందిన రైతులు పంటచేలకు వెళ్తుండగా రోడ్డు పక్కన సంచరిస్తూ కనిపించడంతో భయాందోళనకు గురయ్యారు. రైతులు పెద్దగా అరవడంతో రోడ్డు పై నుంచి దూరంగా చెట్లపొదల నుంచి చెరువు వైపు పారిపోయింది. ఎలుగుబంటి పంటచేలవైపు రాకుండా అటవీశాఖ అధికారులు చూడాలని రైతులు కోరుతున్నారు.

గుడుంబా విక్రేతల బైండోవర్



బైండోవర్ చేస్తున్న ఎక్సైజ్ ఎస్సై

ఖానాపూర్: మండలంలోని సత్తనపల్లి, సేవానాయక్ తండాలో గుడుంబా విక్రయిస్తూ పట్టుబడ్డ ఇద్దరిని సోమవారం తహసీల్దార్ రాజమోహన్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై రాయబారపు రవి తెలిపారు. నిందితుల వద్ద ఇప్పటికే గుడుంబా స్వాధీనం చేసుకోవడంతో పాటు కేసులు నమోదు చేశామన్నారు. మరోసారి నేరం చేయకుండా సత్ప్రవర్తన కలిగి ఉండేందుకు బైండోవర్ చేశామన్నారు. ఎవరైనా గుడుంబా విక్రయిస్తే ప్రజలు తమకు సమాచారం అందించాలని కోరారు.

జొన్నపంట దగ్ధం



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

భైంసారూరల్(ముధోల్): మండలంలోని తిమ్మాపూర్ గ్రామ శివారులో సోమవారం జొన్నచేనులో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం చోటు చేసుకుని జొన్నపంట దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కుంటాల మండలంలోని కల్లూరు గ్రామానికి చెందిన ఆశగౌడ్ తిమ్మాపూర్ గ్రామ శివారులోని నాలుగెకరాల్లో జొన్నపంట సాగు చేశాడు. రెండు ఎకరాల్లో పంటను కోసి చేనులోనే కుప్పలుగా పోసాడు. సోమవారం ప్రమాదవశాత్తు పంటచేనులో మంటలు చెలరేగడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో రూ.70వేల వరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతు ఆశగౌడ్ తెలిపాడు.

రెండేళ్లుగా నిరీక్షణ..

- ఇప్పటి వరకూ అందని ఎస్సీ కార్పొరేషన్ రుణాలు
- 2020–21లో దరఖాస్తుల స్వీకరణ
- 132 మంది లబ్ధిదారుల ఎంపిక
- కార్యాలయాల చుట్టూ నిరుద్యోగుల ప్రదక్షిణ
- స్పందించని ప్రభుత్వం, అధికారులు
- ఆందోళనలో లబ్ధిదారులు



ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం

ఆదిలాబాద్‌రూరల్: నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి అవకాశం కల్పించడానికి, రైతులు పంటల దిగుబడులు సాధించడానికి ప్రభుత్వం ఆయా శాఖల కార్పొరేషన్‌ల ద్వారా ఆయా ఆర్థిక సంవత్సరాల్లో బ్యాంక్ లింకేజీ సబ్సిడీ రుణాలు అందజేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. వారికి స్కిల్డ్, అన్‌స్కిల్డ్ కింద రుణాలు అందించేందుకు 2020–21 ఆర్థిక సంవత్సరంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా జిల్లాలోని ఎస్సీ నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది. లబ్ధిదారులను సైతం ఎంపిక చేసింది. ఇప్పటి వరకూ వారికి రుణాలు అందకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

వివిధ కేటగిరీల్లో..
బ్యాంక్ లింకేజీ ద్వారా అందజేసే సబ్సిడీ రుణాలకు ప్రభుత్వం మూడు కేటగిరీలలో సబ్సిడీని అందజేస్తుంది. మొదటి కేటగిరీలో రూ.లక్ష రుణం కోసం రూ.80 శాతం సబ్సిడీ, మిగితా 20 శాతం బ్యాంక్ రుణం, రెండవ కేటగిరీలో రూ.2 లక్షల రుణానికి 70 శాతం సబ్సిడీ, మిగితాది బ్యాంక్ రుణం, మూడో కేటగిరీ రూ.3 లక్షలకు పైగా రూ.5 లక్షలలోపు రుణానికి 60 శాతం సబ్సిడీ, మిగితాది బ్యాంక్ రుణం.

132 మంది లబ్ధిదారుల ఎంపిక
స్వయం ఉపాధి రుణాల కోసం అన్‌స్కిల్డ్ రంగంలో ఎలక్ట్రికల్ షాప్, చెప్పుల దుకాణం, టెంట్‌హౌజ్, తదితర యూనిట్లను ఏర్పాటు చేసుకోవడానికి 83 మందికి రూ. 2.35 కోట్లతో, మరో 82 మందికి రూ. 2.35 కోట్లతో స్కిల్ రంగంలో ఆటో, కారు, బేకరీ, బ్యూటీపార్లర్ రుణాలు ఇవ్వాలని అధికారులు 2020–21 ఆర్థిక సంవత్సరంలో లక్ష్యం పెట్టుకున్నారు. అయితే ఇందులో అన్‌స్కిల్డ్ రంగంలో 83 మందికి రూ.1.04 కోట్లు సబ్సిడీ రూపంలో అందజేసేందుకు లబ్ధిదారులను ఎంపిక చేశారు. స్కిల్ రంగంలో 82 యూనిట్లకు గానూ 49 మందిని ఎంపిక చేయగా వీరికి సబ్సిడీ కింద రూ.86.47 లక్షలు అందజేయనున్నారు. ఇదిలా ఉండగా స్కిల్డ్ రంగంలో 82 మందికి కేవలం 49 మంది లబ్ధిదారులకు మాత్రమే రుణం మంజూరు కాగా మిగితా 49 మందికి బ్యాంక్ కన్సల్ట్ ఇవ్వకపోవడంతో వారికి రుణాలు మంజూరు కాలేదు.

ఏ ఒక్కరికీ జమకాని సబ్సిడీ
ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 2020–21 ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ లింకేజీ సబ్సిడీ రుణాలు మంజూరైనప్పటికీ వారి ఖాతాలలో సబ్సిడీ నగదు జమ కావడం లేదు. దీంతో యూనిట్లు మంజూరైన లబ్ధిదారులు సబ్సిడీ కోసం ఆ శాఖ కార్యాలయాలు, స్థానికంగా ఉన్న ప్రజా ప్రతి నిధుల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నా రు. అటు సబ్సిడీ జమకాక, ఇటు రైతుబంధుకు దరఖాస్తు చేసుకోలేకపోతున్నామని పేర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే సబ్సిడీని తమ ఖాతాల్లో జమ చేస్తే యూనిట్లు ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ఆస్కారం ఉంటుందని చెప్పున్నారు.

ఆందోళనలో లబ్ధిదారులు
ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎస్సీలకు సబ్సిడీపై అందజేసే స్వయం ఉపాధి రుణాల కోసం దరఖాస్తు చేసుకుని రెండేళ్ల గడుస్తున్నా ఇప్పటికీ రుణాలు అందకపోవడంలో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. లబ్ధిదారుల ఎంపికలో ఆసక్తి కనబర్చి రుణాలు సబ్సిడీ జమ చేయడంలో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. ఉపాధి అవకాశాలు లేకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి సకాలంలో సబ్సిడీ జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ల్యాబ్ కోసం దరఖాస్తు...



రెండేళ్ల క్రితం ఎస్సీ కార్పొరేషన్ శాఖలో రూ.3 లక్షల యూనిట్ కోసం దరఖాస్తు చేసుకున్నా. కార్పొరేషన్ ద్వారా వారం రోజుల పాటు ఉట్నూర్‌లో శిక్షణ కూడా ఇచ్చారు. కానీ ఇప్పటి వరకు సబ్సిడీ జమ కావడం లేదు. సబ్సిడీ మంజూరైతే సొంతంగా క్లినిక్ ల్యాబ్ ఏర్పాటు చేసుకుంటా.

– స్వరూప, పిప్పల్‌ధరి, ఆదిలాబాద్‌రూరల్

కూలీ పనులకు వెళ్తున్నా



ఎస్సీ కార్పొరేషన్ శాఖలో రూ.50వేల విలువ చేసే టీ, టిఫిన్ సెంటర్ యూనిట్ కోసం దరఖాస్తు చేసుకున్నా. కానీ రెండేళ్లు అవుతున్నా ఇప్పటి వరకు సబ్సిడీ రావడం లేదు. కూలీ పనులు చేసి కుటుంబాన్ని నెట్టుకొస్తున్నా.

– దాసరి దేవత, కచికంటి, ఆదిలాబాద్

ఖాతాలోనే జమ అవుతుంది



2020–21 ఆర్థిక సంవత్సరంలో స్కిల్డ్, అన్‌స్కిల్డ్ రంగంలో బ్యాంక్ లింకేజీ సబ్సిడీ ద్వా రా 165 మంది లబ్ధిదారులకు రుణాలు అందించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇందులో అన్‌స్కిల్డ్ రంగంలో 83, స్కిల్డ్ రంగంలో 82 మందికి గానూ 49 మంది లబ్ధిదారులు ఎంపికయ్యారు. సబ్సిడీ నేరుగా లబ్ధిదారుని ఖాతాలోనే జమ అవుతుంది.

– శంకర్, ఈడీ, ఎస్సీ కార్పొరేషన్

తేనెటీగల నుంచి తప్పించుకుందామని..

- బావిలో దూకిన యువకుడు
- ఈత రాకపోవడంతో నీటమునిగి మృతి



నర్సయ్య మృతదేహం

సోన్: తేనెటీగల దాడి నుంచి తప్పించుకునేందుకు ఓ యువకుడు బావిలో దూకాడు. బావి లోతు ఎక్కువగా ఉండడం, అతడికి ఈత రాకపోవడంతో నీట మునిగి మృతిచెందాడు. ఈ విషాద సంఘటన సోన్ మండలం సాకేర గ్రామంలో సోమవారం జరిగింది. సాకెర గ్రామంలో సోమవారం కొంతమంది భీమన్న దేవుని పండుగ నిర్వహించారు. ఈ క్రమంలో ఊరు శివారులో ఉన్న మర్రి చెట్టు వద్దకు డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా వెళ్లారు. అక్కడ దీపాలు, అగర్‌బత్తులు వెలిగించారు. ఒకవైపు డప్పు చప్పుళ్లు.. మరోవైపు అగర్‌బత్తుల పొగకు చెట్టుపైన ఉన్న తేనెతుట్టె నుంచి ఈగలు లేచాయి. పూజలు చేస్తున్నవారిపై దాడిచేశాయి. దీంతో అందరూ అక్కడి నుంచి పరుగులు తీశారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన కల్లెడపు నర్సయ్య(27) కూడా తేనెటీగల నుంచి తప్పించుకునేందుకు పరుగులు తీశాడు.

బావిలో దూకితే కుట్టవని..
ఈ క్రమంలో సమీపంలోని చేనులో వ్యవసాయ బావి ఉంది. నీటిలో మునిగితే తేనెటీగల నుంచి తప్పించుకోవచ్చని భావించాడు. లోతు గురించి ఆలోచించకుండా బావిలో దూకాడు. అయితే బావి లోతు ఎక్కువగా ఉండడం, నర్సయ్యకు ఈత రాకపోవడంతో సాయం కోసం కేకలు వేశాడు. దీంతో సమీపంలోని వారు బావి వద్దకు చేరుకున్నారు. కానీ, అప్పటికే నర్సయ్య నీటమునిగాడు. స్థానికులు బావిలో దిగి నర్సయ్యను పైకి తీసుకెవచ్చారు. కానీ ఫలితం లేకుండా పోయింది. నీళ్లు మింగడంతో చనిపోయాడు.

రెండేళ్ల క్రితమే వివాహం..
నర్సయ్యకు ప్రవంతితో రెండేళ్ల క్రితమే వివాహమైంది. వీరికి సంతానం కలుగలేదు. ఈ క్రమంలో అనుకోకుండా జరిగిన ప్రమాదంలో నర్సయ్య మృత్యువాతపడ్డాడు. గ్రామస్తుల సమాచారంతో ఎస్సై రవీందర్ గ్రామానికి చేరుకుని పరిశీలించారు. పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

దప్పిక తీరుస్తూ..అడవులను సంరక్షిస్తూ..

- వేసవిలో వన్యప్రాణులు, అటవీ సంరక్షణకు అటవీశాఖ ప్రత్యేక చర్యలు



కడెం(ఖానాపూర్): మానవాళి మనుగడకు అడవులే ఆధారం.. అడవిలో ఉంటున్న మూగజీవాలు వేసవి కాలంలో దప్పిక తీర్చుకునేందుకు జనారణ్యంలోకి వచ్చి మృత్యువాత పడుతుండేవి. అడవుల్లో వ్యాపించే మంటల్లో చిక్కుకుని అగ్నికి ఆహుతి అయ్యేవి. వన్యప్రాణుల దాహార్తిని తీరుస్తూ వృక్ష, జంతుజాలానికి రక్షణ కల్పించేందుకు అటవీశాఖ అధికారులు తీసుకుంటున్న ప్రత్యేక చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి.

వన్యప్రాణుల దప్పిక తీరుస్తూ..
వేసవికాలంలో వాగులు, వంకలు ఎండిపోయి నీరు లేక వన్యప్రాణులు దప్పిక తీర్చుకునేందుకు జనారణ్యంలోకి వచ్చేవి. నీటిని తాగేందుకు వ్యవసాయ బావుల వద్దకు వచ్చి అందులో పడిపోవడం, వీధి కుక్కల దాడుల్లో మృత్యువాత పడటం చూశాం. కానీ కొన్నేళ్లుగా అటవీశాఖ తీసుకుంటున్న ప్రత్యేక చర్యలతో వన్యప్రాణులకు అడవుల్లో నీళ్లు దొరుకుతున్నాయి. వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు ఖానాపూర్ డివిజన్ పరిధిలో 320 సాసర్ ఫీట్స్, 50 చెక్‌డ్యాంలు, పెర్కులేషన్ ట్యాంక్(నీటి కుంటలు), 24 సోలార్ బోర్‌లతో పాటుగా నీటి లభ్యత ఉండే వాగుల్లో సుమారు 20 వరకు చెలిమెలు ఏర్పాటు చేశారు. అటవీ సిబ్బంది ట్యాంకర్ల ద్వారా సాసర్ ఫీట్స్‌లలో నీటిని నింపేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ముందస్తుగానే ఫైర్‌లైన్స్..
ఏటా వేసవి కాలంలో అడవుల్లో మంటలను అరికట్టేందుకు అటవీ అధికారులు ప్రత్యేకమైన చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో 3,56,251 హెక్టార్లలో భూవిస్తీర్ణం ఉండగా 1,20,566.75 హెక్టార్లలో అడవులు విస్తరించి ఉన్నాయి. 33.08 శాతం అటవీ ప్రాంతం ఉంది. ఒక ప్రాంతంలో మొదలైన మంటలు మరో ప్రాంతంలోకి వ్యాపించకుండా ఉండేందుకు అటవీ సిబ్బంది ఏటా వేసవికాలం ఆరంభం నుంచే ప్రత్యేకమైన బ్లోయర్ మిషన్‌లతో రాలిపోయిన ఆకులన్నింటినీ ఒకచోటకు చేర్చి ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఆ తర్వాత ఆకులను కుప్పలుగా చేసి తగలబెడతారు. అడవుల్లో మంటలు వ్యాపించిన సమాచారం తెలిసిన వెంటనే తెలియజేసేందుకు అటవీశాఖ గ్లోబల్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఏర్పాటు చేసింది. దీని ద్వారా ఎప్పటికప్పుడు అటవీ ప్రాంతాల్లో అంటుకున్న మంటలను శాటిలైట్ రిసీవ్ చేసుకుని హైదరాబాద్‌లోని అటవీశాఖ కార్యాలయానికి అందజేస్తుంది. అక్కడి నుంచి సంబంధిత అధికారులకు సమాచారం అందుతుంది. సమాచారం అందుకున్న సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు చర్యలు తీసుకుంటారు.



మంటలు ఆర్పుతున్న సిబ్బంది(ఫైల్)



నీటిని తాగుతున్న వన్యప్రాణులు

ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం



వేసవిలో వన్యప్రాణుల దప్పిక తీర్చేందుకు అటవీ ప్రాంతంలో మూగ జీవాలకు అందుబాటులో నీళ్లు ఉండేలా ప్రత్యేకమైన చర్యలు తీసుకుంటున్నాం. అడవులు దగ్ధం కాకుండా ఉండేందుకు వేసవి కాలం ప్రారంభంలో ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేసి మంటలు వ్యాపించకుండా చర్యలు తీసుకుంటున్నాం. అడవుల సంరక్షణ మనందరి బాధ్యత. అటవీ, వన్యప్రాణుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలి.

– కోటేశ్వర్‌రావు, ఎఫ్‌డీవో, ఖానాపూర్

‘గిరి’పల్లెలకు మిషన్ భగీరథ నీరు



గ్రామ పంచాయతీ ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్న సర్పంచ్

- కదిలిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన గూడేలు, తండాల్లో తాగునీటి కోసం గిరిజనులు పడుతున్న కష్టాలపై ‘సాక్షి’లో సోమవారం ప్రచురితమైన ‘దాహం తీర్చని భగీరథ’ కథనానికి అధికారులు స్పందించారు. ఉదయం 8 గంటల నుంచే మిషన్ భగీరథ నీటిని సరఫరా చేశారు. సర్పంచ్ జాదవ్ జిజాబాయి ప్రేమ్ సింగ్ గ్రామ పంచాయతీ ట్యాంకర్ ద్వారా తండా, కొలంగూడ, గోండుగుడాలకు సరిపడా నీటిని సరఫరా చేశారు. సుంగాపూర్ సమీపంలో ఉన్న వాగుపై నీటి నిల్వ కోసం చిన్న ప్రాజెక్టు మంజూరు చేయాలని ఆమె అధికారులను కోరారు. ‘సాక్షి’లో వచ్చిన కథనంతో దాహార్తి తీర్చడంపై గిరిజనులు హర్షం వ్యక్తం చేశారు.

నీటి కొరత తీర్చిన అధికారులు
బోథ్: ‘దాహం తీర్చని భగీరథ’ శీర్షికన ‘సాక్షి’లో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఉదయమే నాగాపూర్ గ్రామాన్ని సందర్శించి బావిలో ఉన్న నీటిని పరిశీలించారు. బోరు ద్వారా నీటిని మిషన్ భగీరథ ట్యాంకులో నింపారు. దీంతో గ్రామస్తులకు నీరు అందనుంది. గతంలో నీటిని ఓపెన్ బావిలో నింపడం వల్ల గ్రామస్తులు ఇబ్బంది పడ్డారు. మిషన్ భగీరథ ట్యాంకులో నీటిని నింపడంతో గ్రామంలో నీటి కొరత తీరనుంది. గ్రామంలో నీటికొరత ఉండనివ్వమని మండల పంచాయతీ అధికారి జీవన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.



గోండుగూడలో సరఫరా అవుతున్న మిషన్ భగీరథ నీళ్లు

అత్యవసరమైతే అవస్థలు పడాల్సిందే





ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పేద ప్రజల వైద్యానికి వర ప్రదాయినిగా నిలిచే రిమ్స్ ఆస్పత్రిలో అధికారుల నిర్లక్ష్యం రోగులతో పాటు వారి సహాయకులు ఇబ్బందులకు గురవుతున్నారు. మెరుగైన వైద్యం మాట అటుంచితే.. కనీసం అత్యవసర పరిస్థితుల్లో ఒంటికి.. రెంటికి వెళ్లాలంటే ఆస్పత్రిలోని వివిధ విభాగాల్లో గల మరుగుదొడ్లకు తాళాలు వేసి ఉంచడంతో అవస్థలు పడాల్సిన దుస్థితి నెలకొంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- ఐటీడీఏ ఏపీవో కనక భీంరావు



అర్జీలు స్వీకరిస్తున్న ఏపీవో కనక భీంరావు

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ఏపీవో కనక భీంరావు అన్నారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆదిలాబాద్ మండలం చిచ్‌ధరి ఖానాపూర్‌కు చెందిన కుమ్రం మోతీరాం స్వయం ఉపాధి కోసం బొలెరో వాహనం మంజూరు చేయాలని, ఉట్నూర్ మండలం శ్యాంనాయక్ తండాకు చెందిన ఆడే సంతోశ్ కాంట్రాక్ట్ ఉద్యోగం ఇప్పించాలని, గాదిగూడ మండలం రాంపూర్ గ్రామస్తులు నీటి వసతులు కల్పించాలని, పెంబి మండలం ఇటిక్యాల గ్రామానికి చెందిన విజయ్ కుమార్ భూమి పట్టా మంజూరు చేయాలని అర్జీలు సమర్పించారు. పింఛన్, డబుల్ బెడ్రూం ఇళ్లు, ఆశ్రమ పాఠశాలల్లో ప్రవేశాలు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలంటూ దరఖాస్తులు సమర్పించారు. కార్యక్రమంలో ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, ఏవో రాంబాబు, జేడీఎం నాగభూషణ్, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్, డీపీవో ప్రవీణ్, ఐటీడీఏ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి

నర్సాపూర్(జి): మండలంలోని బుర్గుపల్లి(కే) గ్రామానికి చెందిన దుగ్గి భోజవ్వ(70) సోమవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. కాలకృత్యాలు తీర్చుకునేందుకు 61వ జాతీయ రహదారి దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి మరిది కుమారుడు దుగ్గి లస్మన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.

ఇద్దరికి గాయాలు

గుడిహత్నూర్(బోథ్): మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మహారాష్ట్రకు చెందిన ఇద్దరు యువకులు గాయాల పాలయ్యారు. స్థానికులు.. పోలీసులు తెలిపిన ప్రకారం మహారాష్ట్రలోని ఇస్లాపూర్ సమీపంలోని కోస్‌ఖేడ్‌కు చెందిన ఖేద్కర్ పవన్ తన మిత్రుడు సతీష్‌తో కలిసి సోమవారం పనినిమిత్తం ఆదిలాబాద్‌కు వచ్చాడు. సాయంత్రం ఇంటికి తిరిగి వెళ్తుండగా మండల కేంద్రంలోని శర్మ దాబా సమీపంలో బైక్ అదుపుతప్పి లారీని వెనుక నుంచి ఢీకొట్టారు. దీంతో ఇద్దరికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108లో రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై రెహమాన్ తెలిపారు.

‘కుమారున్ని ఉద్యోగం నుంచి తొలగించడంతోనే మృతి’

ఆదిలాబాద్‌రూరల్: తమ కుమారుడిని ఉద్యోగం నుంచి తొలగించడంతోనే ఆదిలాబాద్ రూరల్ మండలంలోని న్యూరాంపూర్ గ్రామానికి చెందిన కొట్నాక్ జంగుబాయి మృతి చెందిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి ఆరోపించారు. జంగుబాయికి సంబంధించిన మూడెకరాల వ్యవసాయ భూమి రేణుకా సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణం కోసం తీసుకుని ఆమె కుమారునికి ఉద్యోగం ఇచ్చారన్నారు. మూడు నెలల పాటు పని చేయించుకున్న యాజమాన్యం మండలానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి ఒత్తిడితో వేరే వ్యక్తికి ఉద్యోగం ఇప్పించి ఆమె కుమారుడిని తొలగించారని మృత్యురాలి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారన్నారు.

ఒకరు అదృశ్యం

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని దస్నాపూర్‌కు చెందిన బట్టు రమాకాంత్ (34) అదృశ్యమైనట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. రమాకాంత్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నెల 22న ఉదయం ఆటో తీసుకుని ఇంటి నుంచి వెళ్లాడు. ఇప్పటి వరకు తిరిగి రాకపోవడంతో సోమవారం అతని భార్య అనిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.